క్లుప్తంగా

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వరదరాజు



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా కురవి మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన కోల వరదరాజును నియమిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచంద్రర్‌రావు గురువారం తెలిపారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు



గార్ల: నేటినుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం స్థానిక పాకాల ఏటి నుంచి వేదపండితులు బిందెతీర్థంను మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చారు. బిందెతీర్థంతో గార్లలోని వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు అభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు రాముస్వామి, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్, ఆలయ ఈఓ నందనం కవిత, ప్రధాన కార్యదర్శి మాళోత్ రమేష్ పాల్గొన్నారు.

గ్యార్మీ షరీఫ్ వేడుకలు



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో గ్యార్మీ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మహబూబ్ పాషా, ఫకీర్ ఆసిఫ్ అలీ, అసద్ అలీ ఖాన్, యాకుబ్ అలీ, కందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, షేక్ ఖాదర్ బాబా, షేక్ లతీఫ్ పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని బాధ్యత మనందరిపై ఉందని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. మండలంలోని గిరిపురం గ్రామానికి చెందిన మహిళా కోలాట, నృత్య బృందం మహిళలు మండలంలోని ఎల్లంపేటలో రవిచంద్రను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీచ్‌రాజ్‌పల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌ను కలిశారు.

వసతి గృహాలను ప్రారంభించాలి



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని డోర్నకల్ మండలం చిలుకోడు మోడల్ స్కూల్, మానుకోట అనంతారం మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలను తక్షణమే పునఃప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేలోతు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ రామారావుకు గురువారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మోడల్ స్కూల్ వసతి గృహాన్ని ప్రారంభించాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాష్, నాయకులు సింహాద్రి, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



దంతాలపల్లి: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తొర్రూరు సీఐ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో కలసి వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేని వస్తువులు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతు బంధు’ నిలిపివేయాలనడం సిగ్గుచేటు

మరిపెడ: రైతుబంధు నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరి కొంతమంది ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మరిపెడలో గురువారం ఆయన మాట్లాడారు. రైతులకు ఆసరాగా ఉండే ఈ పథకం నిలిపివేయాలనడం కాంగ్రెస్ పార్టీకి రైతులపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరాపింఛన్లు, గృహలక్ష్మీ, రైతుభీమా, ఉచిత కరెంట్ పథకాలు నిలిపివేస్తారని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ గుడిపుడి నవీన్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ అయూబ్‌పాష, నాయకులు రవీందర్, కృష్ణ, నర్సయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్



గార్ల: డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

చిన్నగూడూరు: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు జయ్యారం గ్రామంలో వివిధ పార్టీల ముఖ్య నాయకులను ఎమ్మెల్యే రెడ్యా మర్యాదపూర్వకంగా కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఆయూబ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి

గార్ల: రాష్ట్రం అభివృద్ధి కావాలంటే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. గురువారం మండలంలోని బాలాజీతండా, సేరిపురం, పినిరెడ్డిగూడెం, గోపాలపురం, చిన్నబంజర పంచాయతీల్లో జెడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందుతో కలిసి ఎమ్మెల్యే ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి సభల్లో ప్రసంగించారు. రైతులకు రబీలో రైతుబంధు వద్దంటున్న కాంగ్రెస్ పార్టీ ఒకవేళ అధికారంలోకి వస్తే రైతుబంధు ఏమి ఇస్తుందని ఎద్దేవా చేశారు. సేరిపురం గ్రామంలో పంటపొలాల వద్ద ఎమ్మెల్యే హరిప్రియ రైతులతో కలసి కాంగ్రెస్ పార్టీపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో గార్ల, బయ్యారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, తాత గణేష్, మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్, ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్, సర్పంచ్‌లు శంకర్, సక్రు, జ్యోతి, భారతి, ఉషబాలు, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ ఎండి ఖదీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెప్పాలి

నెల్లికుదురు: కాంగ్రెస్ నాయకులకు రైతులే బుద్ధి చెప్పాలని రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భూక్య బాలాజీ నాయక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రైతు బంధును నిలిపివేయాలనడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డాడు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేష్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించండి

కేసముద్రం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ప్రజలు ఆశీర్వదించాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మహబూబాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. పల్లె పల్లెకు బీజేపీ.. ఇంటింటికి హుస్సేన్‌నాయక్ ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామడుగు వెంకటాచారి, వోలం శ్రీనివాస్, లెంకలపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేసముద్రం: ప్రచారం చేస్తున్న హుస్సేన్‌నాయక్

కాషాయ జెండా ఎగురవేస్తాం..

దంతాలపల్లి: డోర్నకల్ నియోజకవర్గ గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య సంగీత అన్నారు. గురువారం మండలకేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. 40 సంవత్సరాల కాలంలో నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. రాష్ట్రంలో, నియోజక వర్గంలో కుటుంబ పాలన నడుస్తుందన్నారు. దేశప్రగతితో నియోజకవర్గం పోటీ పడాలంటే బీజేపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు, ప్రభారీ దామోదర్‌రెడ్డి, ధర్మారపు వెంకన్న, మండల అధ్యక్షుడు మురళి, తదితరులు పాల్గొన్నారు.



దంతాలపల్లి: మాట్లాడుతున్న సంగీత

పాలకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేయాలి

తొర్రూరు: పాలకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని పార్టీ రాష్ట్ర నాయకులు, బీజేపీ అభ్యర్థి లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం పాలకుర్తి బీజేపీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ప్రచార కార్యక్రమాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, రాష్ట్ర, జిల్లా నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పూసాల శ్రీమాన్, చీకటి మహేష్, రంగు రాములు, దొంగరి మహేందర్, సుంకరనేని కోటేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలి

గూడూరు: అభివృద్ధి పేరుతో దోపిడీకి పాల్పడుతున్న బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్ అన్నారు. మండలంలోని గోవిందాపురం, దుబ్బగూడెంలకు చెందిన 30 మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన గిరిజనులు గురువారం బీజేపీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, ప్రసన్నకుమార్, సాగర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అల్పాహారం ప్రారంభం

గార్ల: గార్లలోని ప్రాథమిక పాఠశాలలో ఉదయం సీఎం అల్పాహారం పథకాన్ని మండల నోడల్ ఆఫీసర్ ఎం.వీరభద్రం గురువారం లాంఛనంగా ప్రారంభించాడు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు పి నాగేశ్వరరావు, పద్మ, మోకాళ్ల రామచంద్రు, జి నాగేశ్వరరావు, శివ, వీరు, వీరన్న, ఉపాధ్యాయులు మంగీలాల్, బాప్‌చంద్, మమత, పవన్ పాల్గొన్నారు.

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో ముఖ్యమంత్రి అల్పాహారం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం రూపారాణి, పీఈటీ కొమ్ము రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయం అల్పాహారం కార్యక్రమాన్ని కురవిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్‌సీ సంతోష్‌కుమార్, నోడల్ హెచ్ఎం బాలాజీ, కాంప్లెక్స్ హెచ్ఎం వాహిద్, హెచ్ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయులు మల్లయ్య, నిరంజన్ రెడ్డి, భాస్కర్, రవి, సురేష్, లక్ష్మీదుర్గ, సీఆర్‌పీ వెంకన్న పాల్గొన్నారు.



గార్ల: ప్రారంభిస్తున్న అధికారి వీరభద్రం

దొంగతనం కేసులో జైలు

దంతాలపల్లి: దొంగతనం కేసులో నిందితులకు 6నెలలు శిక్ష ఖరారు అయినట్లు స్థానిక ఎస్సై రమేష్‌బాబు గురువారం తెలిపాడు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దముప్పారం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో, దంతాలపల్లి మండలకేంద్రంలో ఓ ఇంట్లో దొంగతనం చేసిన తూర్పటి సాయికృష్ణ, పస్తం సాయిలకు 6నెలల జైలుతోపాటు, రూ.2వేల జరిమానా విధించారు. అలాగే మండల కేంద్రంలో మూడు మోటారు సైకిల్ దొంగిలించిన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం, గానుగుబండ గ్రామానికి చెందిన పోలేపాక రమేష్‌కు 6 నెలల జైలు శిక్షను విధిస్తూ తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత తీర్పు ఇచ్చారు. కేసు నడిపించిన పీసీ రాజారాంను, ఐఓ రమేష్‌బాబును అధికారులు అభినందించారు.

పుల్లారావుకు టికెట్ ఇవ్వాలి

నర్సంపేట: బీజేపీ సీనియర్ నాయకుడు, విద్యావేత్త డాక్టర్ కంభంపాటి పుల్లారావు(ప్రతాప్)కు నర్సంపేట నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ జూలూరి మనీష్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం యువమోర్చా నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంభంపాటి పుల్లారావు(ప్రతాప్)కు బీజేపీ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: నిరుద్యోగులను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబోతు అశోక్, జలగం ప్రవీణ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం సంఘం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఏమయ్యామని వారు ప్రశ్నించారు. ఈనెల 29, 30 తేదీల్లో హైదరాబాద్ నగరంలో జరగనున్న సంఘం రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జంగిలి మహేందర్, బిందు, ఇందు, వెంకటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా రెడ్యానాయక్‌ను గెలిపించాలి

డోర్నకల్: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ తెలిపారు. మండలంలోని ఉయ్యాలవాడ, గుర్రాలకుంట గ్రామపంచాయతీ పరిధిలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేగా రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ ప్రచారం చేశారు.



మాట్లాడుతున్న నున్నా రమణ

గుండెపోటుతో యజమాని మృతి

కన్నీళ్లు కార్చిన శునకం

కేసముద్రం: గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందగా.. యజమాని మృతదేహం వద్ద పెంచుకుంటున్న శునకం దీనంగా కూర్చుని, కన్నీళ్లు పెట్టుకుంటూ తన విశ్వాసాన్ని చాటుకుంది. హృదయాలను కదిలించే ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొద్దుల శ్రీరంగం అనేవ్యక్తి కొన్నేళ్లుగా శునకాన్ని పెంచుకుంటున్నాడు. ఎంతో ప్రేమగా శునకాన్ని(రోమి) చూసుకుంటూ, ప్రతి రోజు ఆ శునకంతో అతడు వాకింగ్ చేసేవాడు. కాగా శ్రీరంగం గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో యజమాని మృతదేహం వద్ద చుట్టూరా తిరుగుతూ, అక్కడే దీనంగా కూర్చుని కన్నీళ్లు పెట్టుకుంటూ యజమాని పట్ల తన ప్రేమను చూపింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ యజమానిపై కుక్కకు ఉన్న విశ్వాసం ఎంతో గొప్పదంటూ ముచ్చటించారు. కాగా ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



యజమాని మృతదేహం పక్కనే దీనంగా కూర్చున్న శునకం

ప్రయాణికులకు ప్లాట్‌ఫాం కష్టాలు



మూడో నంబర్ ప్లాట్‌ఫారంకు వెళ్లకుండా ఏర్పాటు చేసిన రేకులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు ప్లాట్‌ఫాం కష్టాలు ఎదుర్కొంటున్నారు. రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ నుంచి గూడ్స్ యార్డు చివరి వరకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉండగా కొద్దిరోజుల క్రితం రెండో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి గూడ్స్ యార్డు చివరి వరకు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాగా పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జిని కలుపుతూ కనెక్టివిటీ వే నిర్మించలేదు. రెండు బ్రిడ్జిల మధ్య కనెక్టివిటి వే నిర్మించక ముందే రెండో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి గూడ్స్ యార్డు వైపు పాత బ్రిడ్జి తొలగింపు పనులు చేపట్టారు. ఇందుకోసం మూడు, నాల్గో ప్లాట్‌ఫాంలకు వెళ్లే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మార్గంలో రేకులు అడ్డంపెట్టి దారి మూయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టికెట్ బుకింగ్ కార్యాలయం వైపు నుంచి పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా రెండో నంబర్ ప్లాట్‌ఫాం లోపలకు దిగి అక్కడి నుంచి కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మూడు, నాల్గో ప్లాట్‌ఫాంల పైకి చేరుకోవాల్సి వస్తుంది. దీంతో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు గర్భిణులు రెండు సార్లు బ్రిడ్జి మెట్లు ఎక్కడం, రెండు సార్లు దిగాల్సి రావడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. రెండు బ్రిడ్జిలకు కనెక్టివిటీ వే పనులను త్వరలో పూర్తి చేస్తామని రైల్వే అధికారులు చెబుతున్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



పట్టుబడిన బెల్లం, గుడుంబా చూపుతున్న పోలీసులు

మరిపెడ రూరల్: గుడుంబా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ లావుడ్య రాజు హెచ్చరించారు. మండలంలోని ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పూసలతండాలో గుడుంబా స్థావరాలపై సీఐ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 3వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. 300కిలోల నల్లబెల్లం, 50కిలోల పటిక, 70లీటర్ల కాచిన నాటు సారాయిని స్వాధీన పర్చుకున్నట్లు సీఐ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్సై దూలం పవన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నూతన కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: 13మందితో బ్లాక్ కాంగ్రెస్ కమిటీని ప్రకటించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదల్ల యాదవరెడ్డి గురవారం తెలిపాడు. ఉపాధ్యక్షులుగా గంజి గోవర్ధన్‌రెడ్డి, బానోతు బానుచందర్, వలబోజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా నీరుటి లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా వరిపెల్లి పూర్ణచందర్, జక్కిరెడ్డి రామచంద్రారెడ్డి, తుప్పతూరి సతీష్, దేశగాని వెంకన్న, యాకాంతం, అధికార ప్రతినిధి డొనికెన బిక్షపతి, సహాయ కార్యదర్శిగా గుగులోతు శ్రీను, కోశాధికారి ఆవుల బిక్షంలను ఎంపిక చేసి ప్రకటించినట్లు తెలిపారు.

గులకరాళ్ల ట్రాక్టర్ పట్టివేత



గార్ల: మండలంలోని అటవీశాఖ భూముల నుంచి అక్రమంగా గులకరాయి తోలుకొస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ బీట్ ఆఫీసర్ రాందాస్ గురువారం తెలిపారు. సేరిపురం పంచాయతీలో గల బెరైటీస్ గుట్టలను పరిశీలించేందుకు జిల్లా అటవీశాఖ అధికారులు వెళ్తుండగా, అక్రమంగా గులకరాయి తరలిస్తున్న ట్రాక్టర్ తారస పడడంతో అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ రాందాస్ వెంటనే ట్రాక్టను స్వాధీనం చేసుకొని బయ్యారం రేంజర్ కార్యాలయానికి తరలించాడు.

రక్తదాన శిబిరం

గంగారం: పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో ఎస్సై దిలీప్‌తోపాటు, సిబ్బంది, యువకులు రక్తదానం చేశారు. అనంతరం డీఎస్పీ సత్యనారాయణ, గూడూరు సీఐ ఫణీదర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు.

దాతలకు సన్మానం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలో నిర్వహిస్తున్న అన్నదానంలో భాగంగా గురువారం జరిగిన అన్నదానానికి సహకరించిన దాతలు విజయవాడ వాస్తవ్యులు కపిలవాయి సత్యశ్రీనివాస్, ప్రవీణ, శ్రీరంగం కృష్ణమూర్తి, సరోజిని షిర్డీ సాయి అన్నదాన కమిటీ బాధ్యులు సన్మానించారు. కుంచారపు నారాయణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.


ముళ్లకంప ఏర్పాటు

కురవి: మండల కేంద్రం శివారు ఖమ్మం జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి అంచుకు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ నాయకుడు మాలోత్ కిషన్ నాయక్ అనే వాహనచోదకుడు గురువారం ముళ్లకంపను స్వచ్ఛందంగా ఏర్పాటు చేశాడు. అధికారులు స్పందించి బావిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని ఆయన సూచించారు.

విజయవంతం చేయాలి

కేసముద్రం: మానుకోటలో శుక్రవారం జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ యువజన అధ్యక్షుడు తొనుపునూరి సాయికృష్ణ గురువారం కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి శరత్‌యాదవ్, గొల్లపల్లి వీరస్వామి, శతకోటి నరేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



గంగారం: మండలంలోని మడగూడెం గ్రామంలో మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య అధ్వర్యంలో పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ములుగు జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో దుర్గం బుచ్చయ్య, భద్రమ్మ, చెన్నూరి యుగేందర్, రమ, దుర్గం రసజ్ఞ, నాగేశ్వరీ, వెంకటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



బయ్యారం: మండలంలోని జగ్గుతండా పంచాయతీకి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉపసర్పంచ్ వీరస్వామితోపాటు పలువురు వార్డుమెంబర్లు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శైలజ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ రమేష్, సొసైటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

మృతుడు ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో మృతిచెందిన వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన ఎట్టం రామయ్యగా గుర్తించామని టౌన్ ఎస్సై విజయరాంకుమార్ గురువారం తెలిపారు. మృతుడు రామయ్య తపాలా శాఖలో చిరుఉద్యోగిగా పనిచేస్తున్నాడని, కరీంనగర్ వెళ్లి సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణంలో ఈనెల 23వ తేదీ రోజు రాత్రి రైలు ఎక్కి ఇంటికి వస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు చెప్పారన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం ఇంటికి రాకపోవటంతో ఆయన అచూకీ కోసం గాలించగా ఎలాంటి సమాచారం రాలేదని, ఈ నెల 26వ తేదీ పత్రికల్లో వచ్చిన సమాచారం ద్వారా మహబూబాబాద్ పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎందుకు రైలు దిగాడో అర్థంకావటంలేదని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ముదిరాజ్‌లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

తొర్రూరు/మరిపెడ రూరల్: ముదిరాజ్‌లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తోందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాష్ అన్నారు. తొర్రూరు మండల ముదిరాజ్ నాయకులు బండా ప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, మత్స్య పారిశ్రామిక శాఖ జిల్లా ప్రమోటర్ కొత్తూరు రమేష్, పిట్టల ధనుంజయ్, సహదేవ్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముదిరాజ్ నాయకులు